AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
WWW.AKSHARATODAY.IN
26-11-2025 (Wednesday) MAIN EDITION

## ప్రజలు తమ విధులను నిర్వర్తించాలి : మోదీ



**అక్షరటుడే, ఢిల్లీ :** రాజ్యాంగ విధులు ప్రజాస్వామ్యానికి పునాది అని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా బుధవారం ఆయన దేశ ప్రజలకు లేఖ రాశారు. వికసిత్ భారత్ లక్ష్యం వైపు దేశం సాగుతోందన్నారు. దేశ పౌరులు తమ విధుల నిర్వహణకు ప్రతిజ్ఞ చేయాలని కోరారు. వికసిత్ భారత్ నిర్మాణం కోసం దోహద పడాలన్నారు. ప్రతి ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకుని ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయాలని మోదీ సూచించారు. విధులను నిర్వర్తించడం సామాజిక, ఆర్థిక పురోగతికి పునాది అని పేర్కొన్నారు.

## తిరుపతిలో మరోసారి చిరుత కలకలం



**అక్షరటుడే, తిరుమల :** తిరుపతిలో మరోసారి చిరుత కలకలం రేపింది. శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం క్యాంపస్‌లో మంగళవారం రాత్రి చిరుత కనిపించింది. దీంతో విద్యార్థులు, సిబ్బంది ఆందోళన చెందుతున్నారు. ఎస్వీ యూనివర్సిటీ ఎంప్లాయీస్ క్వార్టర్స్ వద్ద నాటుకోళ్ల షెడ్‌పై రాత్రి సమయంలో చిరుత దాడి చేసింది. ఇందుకు సంబంధించిన దృశ్యాలు సీసీ టీవీలో రికార్డు అయ్యాయి. దీంతో అధికారులు రాత్రి 7 గంటల నుంచి ఉదయం 7 గంటల వరకు క్యాంపస్ రోడ్లపై ప్రయాణాలను నిషేధించారు.

## రెండో టెస్టులో ఓడిన భారత్



**అక్షరటుడే, స్పోర్ట్స్ డెస్క్ :** సౌతాఫ్రికాతో జరిగిన రెండో టెస్ట్‌లో భారత్ చిత్తుగా ఓడింది. తొలి ఇన్నింగ్స్‌లో ఏ మాత్రం పోరాటం చేయని టీమిండియా రెండో ఇన్నింగ్స్‌లో కూడా విఫలమైంది. దాంతో 140 పరుగులకే ఆలౌట్ అయింది. ఈ క్రమంలో 25 ఏళ్ల తర్వాత భారత్‌లో సఫారి జట్టు సిరీస్ సాధించింది. 549 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్ చతికిలపడింది.

## అఫ్గాన్‌తో ఉద్రిక్తతలు తగ్గేలా లేవు



**అక్షరటుడే, నేషనల్‌డెస్క్:** అఫ్గానిస్థాన్-పాకిస్థాన్ సరిహద్దుల్లో ఉద్రిక్తతలపై శాంతి చర్చలు విఫలమైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో పాక్ రక్షణమంత్రి ఖవాజా ఆసిఫ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరుదేశాల మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయని.. అవి తగ్గే అవకాశాలు కనిపించట్లేదన్నారు. సంబంధాల పునరుద్ధరణకు చేసిన యత్నాలు విఫలమైనట్లు వెల్లడించారు.

## ఎమ్మెల్యేగా నవీన్ యాదవ్ ప్రమాణం



**అక్షరటుడే, హైదరాబాద్ :** జూబ్లీహిల్స్ ఎమ్మెల్యేగా నవీన్ యాదవ్ బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఆయనతో స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ప్రమాణం చేయించారు. మంత్రి అజారుద్దీన్, కాంగ్రెస్ సీనియర్ నేత వి.హనుమంతరావు, మేయర్ విజయలక్ష్మి, ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, నవీన్ యాదవ్ కుటుంబ సభ్యులు కార్యక్రమానికి హాజరయ్యారు.

## కొబ్బరి రైతుల సమస్యలు పరిష్కరిస్తాం: పవన్ కల్యాణ్



**అక్షరటుడే, అమరావతి :** కొబ్బరి రైతుల సమస్యలను పరిష్కరిస్తామని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. కోనసీమ జిల్లాలో బుధవారం ఆయన పర్యటించారు. కేశనపల్లిలో కొబ్బరి చెట్లను పరిశీలించారు. సముద్ర జలాలలో లక్షలాది కొబ్బరి చెట్లు దెబ్బ తిన్నాయి. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఈ క్రమంలో పవన్ రైతులతో మాట్లాడారు. ఉప్పు నీటితో కొబ్బరి చెట్లు చనిపోతున్నా గత ప్రభుత్వం చర్యలు తీసుకోలేదని విమర్శించారు. కోనసీమ కొబ్బరి రైతులకు శాశ్వత పరిష్కారం కావాలని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. జగన్ పాలనలో జరిగిన తప్పులను తమ ప్రభుత్వం సరిదిద్దుతోందని చెప్పారు. తాను కోనసీమ రైతుల గొంతునవుతానని పవన్ అన్నారు. అన్నదాతల సమస్యలను శాశ్వతంగా పరిష్కరించడానికే పర్యటనకు వచ్చానని చెప్పారు.

## ఛత్తీస్‌గఢ్‌లో 41 మంది మావోల లొంగుబాటు

**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టుల లొంగుబాట్లు కొనసాగుతున్నాయి. ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలో ఎస్పీ డాక్టర్ జితేంద్ర కుమార్ యాదవ్ ఎదుట బుధవారం 41 మంది మావోయిస్టులు లొంగిపోయారు. లొంగిపోయిన వారిపై రూ.1.19 కోట్ల రివార్డ్ ఉన్నట్లు ఎస్పీ తెలిపారు. వీరిలో 12 మంది మహిళలు సహా 29 మంది పురుష మావోయిస్టులు ఉన్నారన్నారు. లొంగిపోయిన వారిలో కీలక సభ్యులు ఉన్నారని చెప్పారు.

**పల్లెల్లో పంచాయతీ ఎన్నికల వేడి మొదలైంది. రాష్ట్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేయడంతో గ్రామాల్లో ఎన్నికల సందడి నెలకొంది. ఎక్కడ చూసినా.. ఏ నలుగురు కలిసిన ఎన్నికల గురించే చర్చించుకుంటున్నారు. తమ గ్రామంలో ఎవరు పోటీ చేస్తారు.. ఎవరు గెలుస్తారని మాట్లాడుకుంటున్నారు. దాదాపు 18 నెలలుగా సర్పంచులు లేక బోసిపోయిన గ్రామాల్లో త్వరలో కొత్త పాలకవర్గాలు కొలువుదీరనున్నాయి.**

**–అక్షరటుడే, హైదరాబాద్ ప్రతినిధి**



# పల్లెల్లో ఎన్నికల సందడి

- రేపటి నుంచి నామినేషన్ల స్వీకరణ
- పోటీకి సిద్ధం అవుతున్న అభ్యర్థులు
- ప్రతిష్టాత్మకంగా తీసుకున్న పార్టీలు

రాష్ట్రంలో మూడు దశల్లో పంచాయతీ ఎన్నికలు నిర్వహించడానికి రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని మంగళవారం షెడ్యూల్ విడుదల చేసిన విషయం తెలిసిందే. డిసెంబర్ 11, 14, 17 తేదీల్లో ఎన్నికలు జరగనున్నాయి. మంగళవారం నుంచి ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. తొలిదశ నామినేషన్ల ప్రక్రియ రేపటి (గురువారం) నుంచి ప్రారంభం కానుంది. దీంతో మొదటి విడతలో ఎన్నికలు జరిగే గ్రామాల్లో అభ్యర్థులు పోటీకి సిద్ధం అవుతున్నారు. కావాల్సిన పత్రాలు తయారు చేసుకుంటున్నారు.

**మూడు దశల్లో..**

రాష్ట్రంలో మూడు దశల్లో ఎన్నికలు జరగనున్నాయి. తొలి దశలో 189 మండలాల్లో 4,236 సర్పంచ్, 37,440 వార్డులకు ఎన్నికలు నిర్వహించనున్నారు. ఈ నెల 27 నుంచి 29 వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. రెండో విడతలో 193 మండల్లాలోని 4,333 గ్రామాలు, 38,350 వార్డులకు ఎన్నికలు జరుగుతాయి. నవంబర్ 30 నుంచి డిసెంబర్ 2 వరకు నామినేషన్లు సమర్పించవచ్చు. మూడో దశలో 182 మండలాల్లోని 4,159 సర్పంచ్, 36,452 వార్డులకు ఎన్నికలు నిర్వహిస్తారు. డిసెంబర్ 3 నుంచి 5 వరకు నామినేషన్లు దాఖలు చేయడానికి అవకాశం ఉంది. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పోలింగ్ ఉంటుంది. మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు చేపడుతారు. అదే రోజు ఫలితాలు విడుదల చేయనున్నారు. వార్డు సభ్యులు పోలింగ్ రోజే ఉప సర్పంచ్‌ను సైతం ఎన్నుకుంటారు.

**త్రిముఖ పోరు**

రాష్ట్రంలో స్థానిక ఎన్నికలను మూడు ప్రధాన పార్టీలు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. ఇటీవల జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో గెలిచిన కాంగ్రెస్ అదే ఊపుతో స్థానికంలోనూ సత్తా చాటాలని చూస్తోంది. మహిళలను ఆకట్టుకోవడానికి కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామాల్లో ఇందిరమ్మ చీరలను హడావుడిగా పంపిణీ చేసింది. అలాగే వడ్డీ లేని రుణాలను సైతం విడుదల చేసింది. ప్రభుత్వ సంక్షేమ పథకాలు తమను గెలిపిస్తాయని కాంగ్రెస్ భావిస్తోంది. మరోవైపు విపక్ష బీఆర్ఎస్ సైతం సర్పంచ్ ఎన్నికల్లో సత్తా చాటాలని చూస్తోంది. ఈ ఎన్నికల్లో ఓడిపోతే కార్యకర్తల్లో నైరాశ్యం అలుముకునే అవకాశం ఉంది. దీంతో ఎక్కువ స్థానాలు గెలుపొందేలా ఆ పార్టీ ప్రణాళికలు రచిస్తోంది. ఈ మేరకు కేటీఆర్, హరీశ్‌రావు సహా ముఖ్య నేతలు పలు జిల్లాల్లో పర్యటిస్తున్నారు. బీజేపీ సైతం స్థానిక ఎన్నికల్లో విజయం కోసం శ్రమిస్తోంది. ముఖ్యంగా ఉత్తర తెలంగాణలో తమ పట్టు నిలుపుకోవాలని భావిస్తోంది. ఈ మేరకు ఎమ్మెల్యేలు, ఎంపీలు పంచాయతీ ఎన్నికలపై ఫోకస్ పెట్టారు. దీంతో గ్రామాల్లో ఎన్నికల సందడి మొదలైంది.

**అక్కడ ఎన్నికలు లేవు**

రాష్ట్రంలోని 31 జిల్లాల్లోని 12,728 జీపీలు, 1,12,242 వార్డులకు ఎన్నికలు జరగనున్నాయి. కోర్టు కేసుల కారణంగా 32 సర్పంచ్, 292 వార్డులకు ప్రస్తుతం ఎన్నికలు నిర్వహించడం లేదు. ములుగు జిల్లా మంగపేట మండలంలో ఎన్నికలపై సుప్రీం కోర్టు గతంలో స్టే విధించింది. దీంతో 25 పంచాయతీ, 230 వార్డులకు ఎన్నికలు నిర్వహించడం లేదు. కరీంనగర్ జిల్లాలోని రెండు పంచాయతీ, 16 వార్డు స్థానాలకు ఎన్నికలకు షెడ్యూల్ విడుదల కాలేదు. ఖమ్మం జిల్లా ఐదు గ్రామాల్లో ఎన్నికలు జరగడం లేదు.

## ఏరోస్పేస్, రక్షణ రంగంలో తెలంగాణ వృద్ధి : సీఎం



**అక్షరటుడే, హైదరాబాద్ :** హైదరాబాద్‌లో జీఎంఆర్ ఏరోపార్క్ సెజ్‌ను ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ బుధవారం వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి, కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు పాల్గొన్నారు. జీఎంఆర్ ఏరోపార్క్‌లో సఫ్రాన్ ఎయిర్‌క్రాఫ్ట్ ఇంజిన్ సర్వీసెస్ ఇండియా ఎల్ఈఏపీ ఇంజిన్ ఎంఆర్‌వో కేంద్రం ప్రారంభోత్సవం, ఎం88 ఎంఆర్‌వో కేంద్రానికి శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో రాఫెల్ విమాన విడి భాగాలు తయారు చేసే యూనిట్ ఏర్పాటు చేశారు. కొత్త ఎంఆర్‌వో యూనిట్లో ఎం88 ఇంజిన్లు తయారు చేయనున్నారు. నేవీ, ఎయిర్‌ఫోర్స్ ఈ యూనిట్ ఉపయోగపడుతుందని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు.

**వెయ్యి మందికి ఉపాధి**

తెలంగాణ ఏరోస్పేస్, రక్షణ రంగంలో ఈ కొత్త సౌకర్యం ఒక ముఖ్యమైన మైలురాయి అని పేర్కొన్నారు. భారతదేశంలో ఇది మొట్టమొదటి ఎల్ఈఏపీ ఇంజిన్ల నిర్వహణ, మరమ్మత్తులు, ఓవర్‌హాల్ కేంద్రం అని ఆయన తెలిపారు. రూ.1,300 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేసిన ఈ కేంద్రంతో 1,000 మందికి పైగా ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. స్థానిక ఎంఎస్ఎంఈలు, ప్రెసిషన్ ఇంజనీరింగ్ సంస్థలకు కొత్త వ్యాపార అవకాశాలు లభిస్తాయని చెప్పారు.

## మరో కేసులో ఐబొమ్మ రవికి 14 రోజుల రిమాండ్



**అక్షరటుడే, హైదరాబాద్:** ఐబొమ్మ ప్రధాన నిర్వాహకుడు రవిని సైబర్ క్రైమ్ పోలీసులు మరోసారి కోర్టులో హాజరు పర్చారు. మరో కేసులో అతనికి నాంపల్లి కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది. రవిపై ఇప్పటి వరకు సైబర్ క్రైమ్ పోలీసులు మొత్తం 5 కేసులు నమోదు చేశారు. మిగిలిన 3 కేసులకు సంబంధించి కూడా పీటీ వారెంట్ దాఖలు చేశారు. కోర్టు అనుమతితో ఆ మూడు కేసుల్లో కూడా అరెస్టు చూపనున్నారు.

## నకిలీ ఐపీఎస్ అధికారి అరెస్ట్




**అక్షరటుడే, హైదరాబాద్ :** నకిలీ ఐపీఎస్ అధికారిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఫిల్మ్‌నగర్‌లో ఐపీఎస్, ఐఏఎస్ అధికారినంటూ శశికాంత్ అనే వ్యక్తి మోసాలకు పాల్పడుతున్నాడు. ఇద్దరు గన్‌మెన్లను పెట్టుకుని బిల్డర్లను బెదిరిస్తున్నాడు. తాను స్పెషల్ ఆఫీసర్ అని చెప్పుకొని బిల్డర్ల దగ్గర డబ్బులు వసూలు చేస్తున్నాడు. అలాగే ప్రభుత్వం నుంచి ప్రాజెక్ట్‌లు ఇప్పిస్తానని పలువురిని నమ్మించి వసూళ్లకు పాల్పడ్డాడు. అయితే ప్రాజెక్ట్‌లు ఇప్పించకపోగా.. డబ్బులు సైతం ఇవ్వకపోడంతో పలువురు బిల్డర్లు నిలదీశారు. సదరు నకిలీ ఐపీఎస్ అధికారి గన్‌మెన్‌లతో బెదిరింపులకు పాల్పడ్డాడు. దీంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు అతడు నకిలీ ఐపీఎస్ అధికారి అని గుర్తించారు. నిందితుడిని బుధవారం అరెస్ట్ చేశారు.

## మారువేషంలో ఆస్పత్రిని తనిఖీ చేసిన సూపరింటెండెంట్

**అక్షరటుడే, గుంటూరు :** గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ మారువేషంలో ఆస్పత్రిలో తనిఖీ చేశారు. జీజీహెచ్ సేవలపై వస్తున్న విమర్శలు, రాత్రి పూట వైద్యులు అందుబాటులో లేకపోవడంపై ప్రజల నుంచి వస్తున్న ఫిర్యాదులను దృష్టిలో పెట్టుకుని సూపరింటెండెంట్ ఎస్ఎస్‌వీ రమణ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. మంగళవారం రాత్రి ఇద్దరు అసిస్టెంట్లతో కలిసి వృద్ధుడి వేషంలో జీజీహెచ్‌కు చేరుకున్నారు. చింపిరి జుట్టు, పాతచొక్కా, మాసిన కండువా, చేతిలో కర్ర, ముఖానికి మాస్క్ ధరించడం ద్వారా ఎవరు గుర్తుపట్టకుండా ఆయన ఆస్పత్రికి వచ్చారు. తనకు వైద్యం చేయాలని సిబ్బందిని అభ్యర్థించడంతో, అక్కడి డాక్టర్లు కొన్ని పరీక్షలకు రిఫర్ చేయడం ఆయన గమనించారు.

## బెట్టింగ్‌కు బానిసై గన్ తాకట్టు పెట్టిన ఎస్సై!



**అక్షరటుడే, హైదరాబాద్ :** హైదరాబాద్ నగరంలోని అంబర్‌పేట్ పోలీస్ స్టేషన్‌లో భాను ప్రకాశ్ ఎస్సైగా పని చేస్తున్నాడు. బెట్టింగ్‌ల బారిన పడి అప్పుల పాలు అయ్యాడు. అనంతరం ఆ అప్పులు తీర్చేందుకు అడ్డదారులు తొక్కాడు. ఓ కేసులో రికవరీ చేసిన ఐదు తులాల బంగారాన్ని సొంతానికి వాడుకున్నాడు. అంతేగాకుండా సదరు ఎస్సై గన్ కూడా కనిపించకుండా పోయింది. దీనిపై ఆరా తీయగా.. గన్‌ను తాకట్టు పెట్టినట్లు తెలిసింది.

**సిబ్బంది గుర్తించడంతో..**

పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ చోరీ కేసులో రికవరీ చేసిన బంగారంతో పాటు ఎస్సై భాను ప్రకాశ్ తుపాకీ మిస్సయినట్లుగా సిబ్బంది గుర్తించారు. ఈ విషయాన్ని వారు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వారు విచారణ చేపట్టగా ఎస్సై ఎలాంటి సమాధానం చెప్పలేదు. అయితే ఎస్సై భాను ప్రకాశ్ బంగారంతో పాటు తన గన్‌ను సైతం పాన్ బ్రోకర్ షాపులో తాకట్టు పెట్టినట్లు సమాచారం. అప్పుల పాలు కావడంతో ఇలా చేసినట్లు ప్రచారం జరుగుతోంది. దీంతో ఉన్నతాధికారులు ఎస్సైని సస్పెండ్ చేశారు.

## థాయ్‌లాండ్‌లో వరదల బీభత్సం.. 13 మంది మృతి

**అక్షరటుడే, నేషనల్ డెస్క్ :** థాయ్‌లాండ్‌లో వరదలు బీభత్సం సృష్టించాయి. ఇప్పటి వరకు 13 మంది మృతి చెందారు. మొత్తం 103 కమ్యూనిటీలకు రెడ్ ఫ్లాగ్ తరలింపు ఉత్తర్వులు జారీ చేశారు. మూడు రోజుల్లో 595 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావడం గమనార్హం. వరుసగా రెండో సంవత్సరం తొమ్మిది థాయ్ ప్రావిన్సులు, మలేషియాలోని ఎనిమిది రాష్ట్రాలను వరదలు ముంచెత్తాయి. దీనితో రెండు దేశాలు దాదాపు 45,000 మందిని తరలించాల్సి వచ్చింది. థాయ్‌లాండ్‌లో 13 మంది చనిపోయారు.



## తుపాన్‌గా మారిన వాయుగుండం

**అక్షరటుడే, హైదరాబాద్ :** బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం తుపాన్‌గా మారింది. దానిని సెన్యార్ తుపాన్ అని పేరు పెట్టారు. సెన్యార్ ప్రస్తుతం మలక్కా జలసంధి ప్రాంతంలో కదులుతోంది. 24 గంటల తర్వాత క్రమంగా బలహీనపడే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. మలేషియా సమీపంలో కొనసాగుతున్న తీవ్ర వాయుగుండం బుధవారం ఉదయం తుపాన్‌గా మారింది. దీనికి యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ సెన్యార్ అని పేరు పెట్టినట్లు ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. పశ్చిమ దిశగా కదులుతున్న తుపాన్ ఇండోనేషియా తీరం వైపు వెళ్లనుంది. దీని ప్రభావం భారత్‌పై తక్కువగా ఉంటుందని అంచాన వేస్తున్నారు. అయితే తీరం వెంబడి పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తాయని అధికారులు తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.